

హార్స్ పవర్

కూర్మ గ్రామ వాసులు కాలాన్ని వెనక్కి తిప్పుతున్నారు. చుట్టుపక్కల అంతా మోటారు ఇంజిన్ల బళ్లను నడుపుతుంటే వీరు మాత్రం గుర్రపు బండిపై సిక్కోలు దారుల్లో ప్రయాణించారు. తమ హార్స్‌పవరే బెటరని చెప్పారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

న్యూస్‌రీల్

రణస్థలం విద్యార్థికి ప్రధాని ప్రశంస



పీఎం మోదీ మెచ్చిన రోహన్ సాయి

రణస్థలం: రణస్థలం మండలంలోని ఐరిస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న లకినాన రోహన్ సాయి 'ప్రేరణ' ప్రోగ్రాంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ప్రధాని మోదీ అభినందిస్తూ.. పోస్టల్ ద్వారా ప్రశంసా పత్రాన్ని మంగళవారం పంపించారు. గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో గత సెప్టెంబర్ 2024 గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఎడ్యుకేషన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రేరణ' ప్రోగ్రాంలో దేశవ్యాప్తంగా 20మందిని ఎంపిక చేశారు. రోహన్ మండల స్థాయి, జిల్లా, రాష్ట్ర ఇలా అన్నీ స్థాయిలు దాటుకుని దేశ వ్యాప్తంగా నిర్వహించిన ప్రోగ్రాంకు ఎంపికైనట్లు ఐరిస్ పాఠశాల కరస్పాండెంట్ కొమనాపల్లి హరికృష్ణ తెలిపారు.

దళ్లవలస వీఆర్‌ఓ సస్పెన్షన్

పొందూరు: మండలంలోని దళ్లవలస సచివాలయంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న జె.తవిటయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వీఆర్‌ఓపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి పొందూరు తహసీల్దార్ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. పిల్లలవలసలో గ్రామసభలకు హాజరుకావడం లేదని, గ్రామస్తులకు అందుబాటులో ఉండడం లేదని అందిన ఫిర్యాదు మేరకు, కృష్ణాపురం గ్రామానికి చెందిన కెల్ల ఉపేంద్ర ఇచ్చిన మరో ఫిర్యాదు మేరకు, సర్వే నంబర్ మార్పి పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేశారని ఇచ్చిన మరో ఫిర్యాదు మేరకు తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. దీంతో మూడు రోజుల కిందట క్రమశిక్షణ చర్యల కింద ఆర్‌డీఓ కార్యాలయానికి సరెండర్ చేశారు. మంగళవారం సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేసి, సేవలు మరింత సులభతరం చేసే సంకల్పంతో ప్రభుత్వం రైతులకు 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) ఆధార్ కార్డు తరహాలో అందించనున్నదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో సొంత భూమి కలిగిన ప్రతి రైతుతోనూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తి చేయించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి పలు శాఖల జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని వివిధ మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్.. ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, మండల అధికారులతో సమావేశంలో భాగంగా గ్రామ సచివాలయాల పనితీరు, పల్లె పండుగ, ఉపాధి హామీ పని దినాలు, ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన, పారిశుద్ధ్యం, స్వర్ణ పంచాయతీ, సీజనల్ వ్యాధులు, ధాన్యం సేకరణ, రెవెన్యూ సర్వేలు, రీసర్వే – ఫిర్యాదులు, లోకాయుక్త కేసులు, గ్రీవెన్స్ ఫిర్యాదుల అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో బయోమెట్రిక్ విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని, సేవల నాణ్యతను మెరుగుపరచాలని చెప్పారు. భూ వివాదాలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని, కోర్టు కేసులను తగ్గించాలని, లోకాయుక్త కేసులను సత్వరమే పరిష్కరించాలని, ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలన్నారు.

హత్యకు గురైన తహసీల్దార్ భార్యకు డిప్యూటీ తహసీల్దార్ పోస్టు

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో గత సంవత్సరం హత్యకు గురైన తహసీల్దార్ రమణయ్య సతీమణి అనూషకు కారుణ్య నియామకం కింద డిప్యూటీ తహసీల్దార్ పోస్టు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్ రమణయ్యను గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన విశాఖపట్నంలోని ఆయన నివాసం వద్ద ఒక వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. ఆయనపై ఆధారపడి ఉన్న తల్లితండ్రులు, ఇద్దరు పిల్లలు ఉండడంతో ఆయన కుటుంబంలో కారుణ్య నియామకానికి అర్హత ఉన్న రమణయ్య భార్యకు డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఇవ్వాలని విజయనగరం కలెక్టర్ సిఫారసు చేశారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కూడా దీనిపై విజ్ఞప్తి చేయడంతో మానవీయ దృక్పథంతో నిబంధనలు సవరించి రమణయ్య భార్య పోలాకి అనూషను ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్ పోస్టులో నియమిస్తున్నట్లు రెవెన్యూ శాఖ ఉత్తర్వులిచ్చింది.



అదుపులో లేని అలవాట్లు అనురాగాలను మాయం చేస్తున్నాయి. దారి తప్పిన ఆలోచనలు.. దాడులు చేసే సంస్కృతికి పురుడు పోస్తున్నాయి. కట్టుబాటు లేని జీవితాలు.. కుటుంబాల మధ్య సఖ్యత తీసుకురాలేకపోతున్నాయి. జిల్లాలో ఇటీవల వరుసగా జరుగుతున్న 'దాడులు' ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఇదివరకు ఎప్పుడో ఎక్కడో గానీ ఇంటి గొడవలు రచ్చకు ఎక్కేవి కావు. కానీ ఇప్పుడు ఏకంగా హత్యల వరకు పరిస్థితులు వెళ్లిపోతున్నాయి. విచక్షణ కోల్పోతున్న కొందరు బతుకులను నరక ప్రాయం చేసుకుంటున్నారు.

దారి తప్పుతున్నారు..

- సొంత కుటుంబ సభ్యులపైనే దాడులు
- తడబాటుతో తప్పిదాలు
- జిల్లాలో వరుసగా చోటుచేసుకుంటున్న సంఘటనలు



టెక్కలి:

భార్యాభర్తలు, అన్నదమ్ములు, తండ్రీ కొడుకులు, ప్రియుడు ప్రియురాలు.. కాదెవరూ దాడులకు అనర్హం అన్న రీతిలో జిల్లాలో వరుస దుర్ఘటనలు జరుగుతున్నాయి. గొడవలను పరిష్కరించుకోలేని తత్వాలు, పరిణితి లేని వయసులో ప్రేమలు, పెళ్లిళ్లు, సమస్యలను ఎదుర్కోలేని బలహీన మనస్తత్వాలు ఇలాంటి దాడులకు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు మంచి చెడులను చెప్పేవి. సమస్యలు వస్తే కుటుంబాలే పరిష్కరించుకునేవి. కానీ వేరు కాపురాలు చాలా కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నాయి. మంచీ చెడ్డ చెప్పే పెద్దవారు లేక దంపతుల మధ్య గొడవలు ప్రాణాంతకంగా మారుతున్నాయి.

కొన్ని ఉదాహరణలు..



- సోంపేట మండలం జింకిభద్ర గ్రామంలో వృద్ధుడు సాహుకారి ఢిల్లేశ్వరరావు మద్యం మత్తులో భార్యతో గొడవపడి చివరకు ఆమెను హతమార్చాడు. ఇద్దరి వయసు డెబ్బైకు పైనే ఉంటుంది. అన్నేళ్లు కలిసి కాపురం చేసినా విచక్షణ లేక ఈ వయసులో నిందితుడు జైలుకు వెళ్లాల్సి వస్తోంది.
- పొందూరు మండలం లైదాం గ్రామానికి చెందిన గొర్లె సాయిప్రసాద్ తన భార్య పావనితో సరదాగా బయటకు వెళ్తున్న క్రమంలో ఇరువురి మధ్య చెలరేగిన తగాదా చివరకు భర్త విచక్షణ కోల్పోయి భార్యను హతమార్చే ప్రయత్నం వరకు చేరుకుంది. ఈ సంఘటనలో అదృష్టవశాత్తు భార్య ప్రాణాలతో బయటపడింది.
- ఇటీవల జిల్లా కేంద్రంలో మహిళా కళాశాల వసతిగృహ విద్యార్థినిపై దాడి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ సంఘటనలో ఆ విద్యార్థినికి పరిచయస్తుడైన యువకుడే దాడికి పాల్పడడం గమనార్హం

ఉన్మాద లక్షణాలతో ప్రమాదం..



కొన్ని సందర్భాల్లో ప్రతి ఒక్కరిలో ఉన్న ఉన్మాద లక్షణం ఉత్తేజంగా మారి విచక్షణ కోల్పోయే ప్రమాదానికి దారి తీస్తుంది. అలాగే భార్య భర్తల మధ్య ఊహాజనితమైన ఆలోచనలు చివరకు విచక్షణ కోల్పోయి దారుణాలకు దారితీస్తాయి. యువత చెడు వ్యసనాలకు బానిసగా మారడం వల్ల తాము అనుకున్నదే జరగాలనే భావనతో తప్పిదాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఒక్క క్షణం మానసికంగా నియంత్రణ పాటించాలి. అలాగే 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదిస్తే... సమస్యను పరిష్కరించే మార్గాన్ని చూపుతారు. మన సాధారణ కుటుంబాల్లో కట్టుబాట్ల మధ్య ఉంటే ఈ ఇబ్బందులు దాదాపు ఉండవు. పాశ్చాత్య నాగరికత అలవాట్లే ప్రస్తుతం ఇబ్బందికరంగా మారుతున్నా యి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అప్పట్లో ఎవరికైనా సమస్య వచ్చినపుడు సామూహిక చర్చల ద్వారా ఆయా సమస్యలను పరిష్కరించుకునేవారు.

– ఎం.అచ్యుతరావు, మానసిక సామాజిక కార్యకర్త

నైతిక విలువలు ముఖ్యం



ప్రస్తుత సమాజంలో పిల్లలతో పాటు పెద్దవారు సైతం నైతిక విలువలు కోల్పోతున్నారు. పెద్దవారి పట్ల గౌరవం, కుటుంబ బాధ్యతల్లో నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తున్నారు. పిల్లలకు చిన్నప్పుడే నైతిక విలువలు నేర్పించాలి. అలా అయితేనే తప్పుడు మార్గంలో వెళ్లరు. తల్లిదండ్రులను, వృద్ధులను, గురువులను గౌరవించాలని చెప్పాలి.

– బి.అన్నపూర్ణమ్మ, సత్యసాయి సేవా సమితి బాల వికాస్ ఉపాధ్యాయురాలు, టెక్కలి

ఏం తెలివి సోదరా..!



- ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో చక్రం తిప్పుతున్న బ్రదర్
- కీలక నేత సోదరుడి కనుసన్నల్లో ప్రైవేటు గోడౌన్లు
- గోడౌన్లలో అనధికార వసూళ్లు
- రెండు చేతులా సంపాదిస్తున్న షాడో నాయకుడు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వెనుక అంతులేని అక్రమాలు కనిపిస్తున్నాయి. కీలక నేత సోదరుడు కాసుల పంట పండించుకుంటున్నారు. తన మాటే శాసనంగా వ్యవహరిస్తూ రెండు చేతులా అడ్డగోలుగా సంపాదిస్తున్నాడు. సాధారణంగా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం మిల్లులకు కేటాయించగా, మిల్లులు ఆడించి తిరిగివ్వాల్సిన సీఎంఆర్‌ను గోడౌన్‌లకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆయా గోడౌన్‌ల వద్ద ఏసీకే(290క్వింటాళ్లు) బియ్యంకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు మిల్లర్ల వద్ద గుంజేస్తున్నారు. దానికి తోడు క్వింటాకు అదనంగా కిలో బియ్యం లాగేస్తున్నారు. అలా ఇస్తేనే ఆ గోడౌన్‌లలో మిల్లర్ల సీఎంఆర్‌ను దించుతారు. లేదంటే రోజుల తరబడి లారీల్లోనే అన్‌లోడింగ్ చేయకుండా వదిలేస్తారు. ముడుపులు ఇవ్వనంతవరకు లారీల్లో సీఎంఆర్ ఉండాల్సిందే. దీనివల్ల ఆ మిల్లర్లపై లారీల అద్దె భారం మరింత పడుతుంది. దీంతో ఎందుకొచ్చిందని ఆ గోడౌన్‌లలో అడిగినంత ఇచ్చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు ఆడించాక సీఎంఆర్ కింద గోడౌన్‌లకు తరలించాల్సి ఉంటుంది. 100 కిలోల ధాన్యం మిల్లర్లకు ఇస్తే 67కిలోల బియ్యం తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఒక ఏసీకే (433 క్వింటాళ్ల ధాన్యం) తీసుకుంటే 290 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. ధాన్యం ఆడించాక ఆ బియ్యాన్ని జిల్లాలో ఉన్న 15గోడౌన్‌లకు అందజేయాలి. ఈ గోడౌన్‌లలో ఆరు ప్రైవేటువి. అత్యధిక స్టాక్ చేసే సామర్థ్యం గల గోడౌన్‌లు కూడా ఇవే. ప్రైవేటుకు చెందిన వాటిలో ఒకటి తప్ప మిగతావన్నీ కీలక నేత సోదరుడి కనుసన్నల్లోనే ఉన్నాయి. మిల్లర్లు ధాన్యం ఆడించాక వచ్చిన బియ్యాన్ని ఆ గోడౌన్‌లకే ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కీలకనేత సోదరుడి కనుసన్నల్లో నడిచే గోడౌన్‌లలో ఏసీకేకి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు లాగేస్తున్నారు. క్వింటాకు అదనంగా మరో కిలో బియ్యం గుంజుకుంటున్నారు. వీరికి ఎదురు చెప్పే వారే లేకపోవడంతో ముడుపులు ఇవ్వక తప్పడం లేదు.

భారీగా ఆర్జన..



క్వింటాకు కిలో అంటే ఒక ఏసీకే(290 క్వింటాళ్ల)కు 290కిలోల బియ్యాన్ని అదనంగా సమర్పించినట్టు అవుతుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమైతే కిలో బియ్యం రూ.37 అంటే ఒక ఏసీకేకి రూ.10,730 వరకు అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఒక ఏసీకే ఇంత వస్తే వేల ఏసీకేలకు ఇంకెంత వస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్న దోపిడీ. ఇక, ఆ గోడౌన్‌లో ఉంచిన బియ్యం బస్తాల్లో తరుగు కూడా రావచ్చు. ఎందుకంటే, ఆ గోడౌన్‌లలో ఏం జరిగినా అడిగే వారు లేరు. దీంతో వారి అక్రమాలు సాగిపోతున్నాయి.

ఇంటర్మీడియెట్ విద్యార్థులతో ప్రయోగాలు

- ఈ నెల 10 నుంచి మొదలైన ప్రాక్టికల్ పరీక్షలు
- 20 వరకు జరగనున్న ప్రయోగ పరీక్షలు
- అంతలోనే ఈ నెల 13 నుంచి ప్రీ ఫైనల్–2 అంటూ షెడ్యూల్ వెల్లడి
- ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఉన్న సీనియర్ ఇంటర్ విద్యార్థులు, సైన్స్ లెక్చరర్లు
- సగం మంది స్టూడెంట్స్, స్టాఫ్‌తో పరీక్షల నిర్వహణ ఎలా అంటూ సర్వత్రా విస్మయం




ప్రాక్టికల్స్ పరీక్షల్లో నిమగ్నమైన విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యను భ్రష్టుపట్టించే నిర్ణయాలతో సర్వత్రా విమర్శల పాలవుతున్న కూటమి ప్రభుత్వం.. తాజాగా ఇంటర్మీడియెట్ విద్యలోనూ అలాంటి గందరగోళ నిర్ణయాలనే అమలు చేస్తోంది. ఓ వైపు సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతుంటే.. ఇంతలో ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కాలేజీల్లో 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ షెడ్యూల్‌ను విడుదల చేయడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కాలేజీల్లో 20వేల మంది వరకు చదువుతుండగా వీరిలో 16842 మంది విద్యార్థులు పరీక్ష ఫీజులను చెల్లించారు.

ప్రాక్టికల్స్‌లో యంత్రాంగం బిజీబిజీ..

జిల్లాలో ఇంటర్మీడియెట్ అధికార యంత్రాంగం, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లంతా ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణలో బిజీబిజీగా ఉన్నారు. ఈనెల 10 నుంచి మొదలైన ప్రాక్టికల్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 164 ఫంక్షనింగ్ జూనియర్ కాలేజీలు ఉండగా వీటిల్లో ప్రాక్టికల్స్‌కు 113 కేంద్రాలను కేటాయించారు.



ఈనెల 20వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనుండగా తొలివిడతగా 61 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి. దీంతో ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లంతా హడావుడిలో ఉన్నారు. ద్వితీ య సంవత్సరం సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరవుతున్నారు. 14,923 మంది ప్రాక్టికల్స్‌కు సన్నద్ధతలో తలమునకలై ఉన్నారు. ఇంతలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు ప్రీ ఫైనల్–2 పేరిట రివైజ్డ్ టైమ్ టేబుల్‌ను ప్రభుత్వ ప్రకటించింది. దీంతో ఇంటర్‌విద్య జిల్లా అధికారులు, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు ఇదేం విచిత్రమంటూ విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

సగం మందితో పరీక్షలెలా సాధ్యం?

సగం మందితో ప్రీ ఫైనల్–2 పరీక్షలను ఎలా నిర్వహిస్తామని ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు తలలు బాదుకుంటున్నారు. జనవరి 20 నుంచి 25 వరకు ప్రీ ఫైనల్–1 పరీక్షలను నిర్వహించి, జవాబు పత్రాలను దిద్దుబాటు చేసి, వచ్చిన మార్కులను బీఐఈఏపీ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేశారు. అప్పుడు కూడా సంక్రాంతి సెలవులు ముగిసి కాలేజీలు తెరిచిన మొదటి రోజు నుంచే ప్రీఫైనల్–1 పరీక్షలను నిర్వహించి విమర్శల పాలయ్యారు. మొదటి రెండు రోజులు విద్యార్థుల హాజరు 40 శాతం, 50 శాతం మాత్రమే నమోదైంది. తాజాగా ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ప్రీ ఫైనల్–2 పరీక్షలను నిర్వహించాలని షెడ్యూల్ వెలువరించిన తీరు పట్ల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు మండిపడుతున్నారు.

వెలవెలబోతున్న కాలేజీలు..

ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఒక పక్క సీనియర్ ఇంటర్ సైన్స్ విద్యార్థులు, లెక్చరర్లు ప్రాక్టికల్స్‌లో నిర్వహణలో ఉండగా, మరికొంతమంది ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు చీఫ్ సూపరింటెండెంట్స్‌గా, సైన్స్ లెక్చరర్లు ప్రాక్టికల్స్ ఎగ్జామినర్లుగా డ్యూటీల్లో ఉండటంతో కాలేజీలు బోసిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నడుమ ప్రీ ఫైనల్–2 పరీక్షలను ఎవరికి నిర్వహించాలి ? ఎలా నిర్వహించాలి ? ఏం చేయాలి ? అంటూ మిగిలిన లెక్చరర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రిన్సిపాళ్లు, లెక్చరర్ల సంఘ ప్రతినిధుల నుంచి ఇంటర్‌విద్య డైరెక్టర్‌కు వినతులు వెళ్లినట్టు ప్రచారం జరుగుతుంది.

17 రోజుల్లో రూ.64.39 లక్షలు



అనివెట్టి మండపంలో హుండీ కానుకల లెక్కింపు జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: రథసప్తమి మహోత్సవాల అనంతరం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల ద్వారా రూ.64,39,016 ఆదాయం లభించింది. రికార్డు స్థాయిలో కేవలం 17 రోజుల్లోనే అంటే గత నెల 24 నుంచి ఈనెల 11 వరకు ఇంతమేరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ అధికారులు ప్రకటించారు. ఆలయ ఈఓ వై.భద్రాజీ, జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్ పర్యవేక్షణలో ఆలయ అనివెట్టి మండపంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. నగదు రూపంలో రూ. 62,10,095, చిల్లర రూపంలో రూ.2,28,921 తో పాటు 17 గ్రాముల నాలుగు మిల్లీ గ్రాముల బంగారం, ఒక కేజీ 212 గ్రాముల వెండి వస్తువులు లభించినట్లుగా ఈఓ భద్రాజీ తెలియజేశారు.

జేఈఈ మెయిన్స్‌లో సిక్కోలు జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు అదరగొట్టే ఫలితాలను సాధించారు. మంగళవారం వెలువడిన జేఈఈ సెషన్–1 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు టాప్ పెర్సంటైల్‌తో దుమ్మురేపారు. జిల్లాకు సంబంధించి నరసన్నపేట కోర్ టెక్నాలజీ సంస్థలో వారం రోజులపాటు జరిగిన పరీక్షలకు 3300 మంది పరీక్షలు జేఈఈ సెషన్–1 పరీక్షలు రాశారు. టాపర్స్ అందరూ జేఈఈ అడ్వాన్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ చెబుతున్నారు.

టాప్ పర్సంటైల్‌గా సాయిరుక్మిణి..



జేఈఈ సెషన్–1 పరీక్ష ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి పెద్దింటి సాయి రుక్మిణి 99.664 పర్సంటైల్‌తో టాపర్‌గా నిలిచింది. శ్రీకాకుళం నగరంలోని విశాఖ–బి కాలనీకి చెందిన సాయిరుక్మిణి శ్రీకాకుళం శ్రీచైతన్య ఐఐటీ క్యాంపస్‌లో చదువుతోంది.

సోంపేట విద్యార్థిని..



సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన ఎస్.మోక్షలలిత మంగళవారం సాయంత్రం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99 శాతం మార్కులు సాధించింది. పట్టణానికి చెందిన మోక్షిత ఎస్వీ మురళీకృష్ణ, శ్రావణిల కుమార్తె. ఈమె రాజమండ్రిలో తిరుమల కళాశాలలో చదువుతోంది.





- శ్రీకాకుళం నగరంలోని బ్యాంకర్స్‌కాలనీకి చెందిన బొడ్డు యశ్వంత్ 99.340 టాప్ 2 పర్సంటైల్‌తో మెరిశాడు.
- శ్రీకాకుళం నగరానికి చెందిన సందుల ధీరజ్ 99.280 పర్సంటైల్‌తో రాణించారు.
- శ్రీకాకుళం నగరానికి చెందిన పైల రాహుల్ 98.312, సనపల రాజా రాఘవేంద్ర 98.284 పర్సంటైల్స్‌తో సత్తాటాచారు. వీరంతా శ్రీకాకుళంలోని శ్రీచైతన్య ఐఐటీ క్యాంపస్‌లో చదువుతున్నారు.

దేవాది కుర్రాడి సత్తా



నరసన్నపేట: జేఈఈ మెయిన్స్ సెషన్ వన్‌లో మండలం దేవాదికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయి సత్తా చాటాడు. 99.98 శాతం మార్కులు పొందాడు. ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో వందకు వంద మార్కులు పొందగా మ్యాథమెటిక్స్‌లో 99.91 మార్కులు కైవశం చేసుకున్నాడు. రుత్విక్‌సాయి తల్లిదండ్రులు శంకర్‌నారాయణ, లత ఇద్దరూ టీచర్లే. తమ కుమారుడు ఈ స్థాయిలో మార్కులు పొందడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందరి నామినేషన్లు ఆమోదం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన
- 20కి గానూ 16 సెట్లను ఆమోదించిన ఆర్వో



అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లు పరిశీలన చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం.నాయక్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి జరుగుతున్న ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులందరి నామినేషన్ పత్రాలు ఆమోదం పొందాయి. ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం.నాయక్ ఆధ్వర్యంలో, అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నామినేషన్ పత్రాల పరిశీలన చేపట్టారు. ఒక్కో అభ్యర్థి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాల వివరాలను మిగిలిన వారికి తెలిసేలా చదివి వినిపించారు. కాగా.. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో మొత్తం 10 మంది అభ్యర్థులు 20 సెట్లను సమర్పించారు. ఇందులో నాలుగు సెట్లు సరిగ్గా లేకపోవడంతో ఆర్వో తిరస్కరించారు. సత్తలూరి శ్రీరంగ పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు, పోతల దుర్గారావు రెండేసి సెట్లు వేయగా వాటిల్లో ఒక్కొక్కటి తిరస్కరణకు గురయ్యాయి. అయితే అభ్యర్థులు ప్రత్యామ్నాయ సెట్లు సమర్పించడంతో, వాటిలో సరైన వాటిని పరిగణనలోకి తీసుకొని ఆమోదించారు. పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడు, కోరెడ్ల విజయగౌరి మూడేసి సెట్లు వేయగా అన్నీ అర్హత సాధించాయి. కోనూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ ఒక్కో సెట్ వేయగా ఆమోదం పొందాయి. ప్రమాణాలకు అనుగుణంగా అందరి పత్రాలు ఉండటంతో 10 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు.

స్వల్పంగా పెరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు

మొత్తం 22,493 మంది ఓటర్లు ● 123 పోలింగ్ స్టేషన్లు



మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. తొలి విడత జాబితా ప్రకారం 21,555 మంది ఓటర్లు ఉండగా.. ఈనెల 10వ తేదీ వరకు వచ్చిన ఓటర్ల నమోదు దరఖాస్తులను పరిశీలించారు. వీటి పరిశీలన అనంతరం కొత్తగా 938 మంది ఓటర్లు పెరిగారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే మొత్తం 123 పోలింగ్ స్టేషన్లు ఖరారు చేశారు.

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
శ్రీకాకుళం	3,416	1,619	00	5,035	31
విజయనగరం	3,270	1,953	00	5,223	29
మన్యం పార్వతీపురం	1,574	759	00	2,333	15
అల్లూరి సీతారామరాజు	920	568	00	1,488	11
విశాఖపట్నం	2,539	2,990	00	5,529	13
అనకాపల్లి	1,789	1,096	00	2,885	24
మొత్తం	13,508	8,985	00	22,493	123

టార్గెట్.. స్టేట్ నంబర్ 1

- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అడుగులు
- ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న అధికారులు
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా బోధన
- స్టడీ మెటీరియల్స్ అందజేయడంలో సర్కారు వైఫల్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాల కోసం జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేస్తున్నారు. మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా శ్రీకాకుళం జిల్లాను ఊరిస్తూ వస్తున్న టాప్ ర్యాంకును ఈ ఏడాది ఎలాగైనా కైవసం చేసుకోవాలని అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారు.

100 రోజుల ప్రణాళిక

టెన్త్ పరీక్షలు వస్తున్నాయంటే విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుంది. అందువలన భయాందోళనకు గురి కాకుండా ఉండేలా అధికారులు 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెడుతున్నారు. విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి చదివిస్తున్నారు. 2022లో విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రెండోస్థానంలో నిలవగా.. జిల్లాల విభజన తర్వాత 2023, 2024లో వెలువడిన ఫలితాల్లోనూ శ్రీకాకుళం జిల్లా రెండో స్థానంలోనే నిలిచింది. దీంతో ఈ ఏడాది మొదటి స్థానం సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు విద్యా సంవత్సరం ఆరంభం నుంచి కృషి చేస్తున్నారు. డీఈవో ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్స్‌ను విద్యార్థులకు అందజేస్తున్నారు. అయితే వారికి మెటీరియల్స్ బుక్‌లెట్స్‌ను అందజేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.

టీచర్లలో గందరగోళం

పేరెంట్స్ మీటింగ్‌లు, ఇతర సమావేశాలు, 117 సవరణ జీవో మెమోతో ఉపాధ్యాయుల్లో కొద్దిపాటి గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. స్కూల్ కాంప్లెక్స్‌లంటూ కీలకమైన సమయాన్ని వృథా చేస్తున్నారు. మరోవైపు అనేక యాప్‌లతో ఇప్పటికీ ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. పదో తరగతి పాఠాలు బోధిస్తున్న టీచర్లు సైతం యాప్‌ల భారంతో అష్టకష్టాలు పడుతున్నారు. ఈ లెక్కన క్లాసుల బోధన సరిగ్గా జరగడం లేదన్న ప్రచారం బలంగా ఉంది. దీంతో స్టేట్‌లో శ్రీకాకుళం టాప్‌ప్లేస్ సాధించగలదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



స్టడీ అవర్‌లో జి.సిగడాం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు



పరీక్షలకు సన్నద్ధమవుతున్న టెన్త్ క్లాస్ విద్యార్థులు

28,938 మంది విద్యార్థులు

షెడ్యూల్ మేరకు 10వ తరగతి పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమై, 31న జరిగే ఒకేషనల్ పరీక్షలతో ముగుస్తాయి. దీనికోసం జిల్లాలో 590 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 28,938 మంది విద్యార్థులు ఇప్పటివరకు పరీక్ష ఫీజులు చెల్లించారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28,273 మంది, ప్రైవేటు విద్యార్థులు 665 మంది ఉన్నారు.

పరీక్ష కేంద్రాలు.. స్పాట్ ఇలా..

ఇదిలా ఉండగా పరీక్షలను జిల్లాలోని 149 కేంద్రాల్లో నిర్వహించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. గతేడాది 145 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. అలాగే స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను ఏప్రిల్ 3వ తేదీ నుంచి నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తులు చేస్తోంది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలతోపాటు ప్రత్యామ్నాయంగా గీతాంజలి స్కూల్‌ను కూడా పరిగణలోకి తీసుకోవాలని యోచిస్తున్నారు.

జిల్లా గణాంకాలు

మండలాలు	హైస్కూల్స్	పరీక్షలు రాసే విద్యార్థుల	రెగ్యులర్ విద్యార్థులు	ప్రైవేటు విద్యార్థులు	పరీక్ష కేంద్రాలు
30	590	28,938	28,273	665	149

వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్



పదో తరగతి పరీక్షల్లో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు డీఈవో నేతృత్వంలో శతశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రతిరోజూ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నాం.

– జి.రాజేంద్రప్రసాద్, డీసీఈబీ సెక్రటరీ, శ్రీకాకుళం

మొదటి స్థానమే లక్ష్యం



శ్రీకాకుళం జిల్లా గత కొన్నేళ్లుగా పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలుస్తూ వస్తోంది. కానీ ఈ ఏడాది మొదటి స్థానమే లక్ష్యంగా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. అనేక కార్యక్రమాలను, ప్రత్యేక తరగతులను చేపడుతున్నాం. ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ ఉత్తీర్ణత మరింత మెరుగుపడేలా ఫోకస్ చేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

క్లుప్తంగా

ఘటనా స్థలం పరిశీలన



రత్నాలు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

సోంపేట: మండలంలోని జింకిభద్ర బీసీ కాలనీలో సోమవారం రాత్రి సాహుకారి రత్నాలు(70)ను ఆమె భర్త డిల్లేశ్వరరావు మద్యం మత్తులో గొడ్డలితో నరికి హత్య చేసిన విషయం తెలిసిందే. దీంతో ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకట అప్పారావు స్థానిక ఎస్ఐ లవరాజుతో కలిసి మంగళవారం పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్పెంటర్ షెడ్ దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

బూర్జ: మండలంలోని బూర్జ గ్రామంలో సింహాద్రి శ్రీనివాసరావుకు చెందిన కార్పెంటర్ షెడ్ దగ్ధమైంది. షెడ్‌లో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించడంతో ఫర్నీచర్, మిషన్లు కాలిపోయినట్లు మంగళవారం ఆయన తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికే ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

జాతీయ కబడ్డీ పోటీలకు హసీనా ఎంపిక



షేక్ హసీనా

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి మహిళల కబడ్డీ ఛాంపియన్‌షిప్-2025 పోటీలకు జిల్లా నుంచి యువ క్రీడాకారిణి షేక్ హసీనా ఎంపికైంది. ఈ పోటీలు హర్యానా రాష్ట్రంలోని పానిపట్టు వేదికగా ఈనెల 14 నుంచి 16 వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టుకు హసీనా ప్రాతినిధ్యం వహించనుంది. ఇటీవలి జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగ్గా రాణించడంతో ఈ ప్రతిష్టాత్మక పోటీలకు ఎంపికైంది. ఎచ్చెర్ల మండల పరిధిలోని తోటపాలెం గ్రామానికి చెందిన షేక్ హసీనా తండ్రి భవన నిర్మాణ కార్మికుడు. ప్రస్తుతం ఈమె పోలీస్ కానిస్టేబుల్ ఈవెంట్స్ పూర్తి చేసుకుని మెయిన్స్‌కు సన్నద్ధమవుతోంది. ఫిజికల్ ఎడ్యుకేషన్ డీపీఈడీ పూర్తి చేసుకుంది. హసీనా జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై శ్రీకాకుళం జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సాదు ముసలి నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాధు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, తవిటమ్మ, నారాయణరావు, కోశాధికారి నాగళ్ల రమేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సెక్రటరీగా పోలినాయుడు



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల జువాలజీ సీనియర్ లెక్చరర్‌గా, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కెప్టెన్ డాక్టర్ యాళ్ల పోలినాయుడు గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) రాష్ట్రస్థాయి కార్యాలయ సెక్రటరీగా ఎంపికయ్యారు. ఈ మేరకు గుంటూరులో మంగళవారం జరిగిన ఆ సంఘ కార్యవర్గ సమావేశంలో డాక్టర్ పోలినాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జీసీటీఏ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.చక్రపతి తెలిపారు. ఈయన ఎన్నికపై శ్రీకాకుళం గవర్నమెంట్ పురుషుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.సురేఖ, రాష్ట్ర అకడమిక్ సెక్రటరీ డాక్టర్ డి.పైడితల్లి, జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎస్.రామకృష్ణ, జోనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ఢిల్లేశ్వర్‌రావు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్రాష్ట్ర నాటక పోటీల విజేతగా ఇంద్రప్రస్థం



మొదటి బహుమతి అందుకుంటున్న ఇంద్రప్రస్థం నాటిక పాత్రధారి రవీంద్రరెడ్డి

కవిటి: మండలంలోని బొరివంకలో కళింగ సీమ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన బల్లెడ అనసూయమ్మ ఆహ్వానిత అంతర్రాష్ట నాటిక పరిషత్ పోటీలు సోమవారం అర్ధరాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో విజేతగా గుంటూరు జిల్లా అభినయ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక నిలిచింది. ద్వితీయ స్థానంలో తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత, తృతీయ స్థానంలో అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురుమేఘం నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో ఉత్తమ నటుడిగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలోని పీవీ వరప్రసాద్, ఉత్తమ నటిగా జనరల్ బోగీలు నాటికలో సురభి ప్రభావతి, ఉత్తమ విలన్‌గా నిశ్శబ్దమా నీ ఖరీదెంత డి.హేమ, ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఇంద్రప్రస్థం నాటికలో ఎస్.రవీంద్ర రెడ్డి, ఉత్తమ రచనగా జనరల్ బోగీలు నాటిక పీటీ మాధవ్, ఉత్తమ దర్శకత్వం ఇంద్రప్రస్థం దర్శకుడు ఎస్.రవీంద్రారెడ్డి, ఉత్తమ సంగీతం విభాగంలో ఇంద్రప్రస్థం నాటిక పి.లీలామోహన్, ఉత్తమ ఆహార్యం నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికకు ఎస్.రమణ, ఉత్తమ రంగాలంకరణలో ఇంద్రప్రస్థం నాటికకు ఎం.భీమకుమార్ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు కళింగసీమ కళాపీఠం అధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి, విశ్రాంత డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాదరావు, డాక్టర్ పి.శివాజీ, డా.వై కృష్ణమూర్తి, పి.కృష్ణారావు, డి.రాజు, ఎం.రామారావు, ఎస్‌వీ రమణ, బి.చిన్నబాబు, బి.శ్రీరాం ప్రసాద్, బి.విజయకృష్ణ, డి.సతీష్ తదితరులు బహుమతులు అందించారు.

గుప్పుమన్న గంజాయి

- ఎమ్మెల్యేకే పట్టుబడిన యువకులు



ఎమ్మెల్యే సమక్షంలో యువకులను ప్రశ్నిస్తున్న ఒకటో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నదానికి నిలువెత్తు నిదర్శనం మంగళవారం జరిగిన ఘటన. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో.. నగరం నడిబొడ్డున.. నిత్యం జనరద్దీ ఉన్న పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ ప్రాంతంలో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం మధ్యాహ్నం మార్కెట్‌ను సందర్శించేందుకు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ వెళ్లారు. దీనిలో భాగంగా మార్కెట్‌లో దుకాణాలు, ఖాళీగా ఉన్న బ్లాకుల్లోని గదులను పరిశీలించగా, అక్కడ ఆయనకు వింత పరిస్థితి ఎదురైంది. ముందుగా ఒక రూమ్‌లో మద్యం సేవిస్తూ కొంతమంది తారసపడ్డారు. అనంతరం మెట్లెక్కి మీదకు వెళ్దామనుకునేలోగా అదే మెట్లుపై ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తూ కనిపించడంతో అవాక్కయ్యారు. దీంతో వెంటనే ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణకు ఫోన్‌లో సమాచారం అందించారు. తదుపరి శ్లాబ్ మీదకు వెళ్లి పరిశీలించగా మద్యం బాటిళ్లు దర్శనమిచ్చాయి. ఈలోగా ఏఎస్ఐ, ఇతర పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని ఎమ్మెల్యే సమక్షంలోనే యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బజారులో ఇలాంటి కార్యకలాపాలు జరగడం అత్యంత దారుణమన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నా యువతలో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని సీఐ సీహెచ్ పైడపునాయుడు వద్ద ప్రస్తావించగా దమ్మలవీధి, గోల్కొండ రేవుకు చెందిన ఇద్దరు యువకులు ఒక గ్రాముకు పైగా గంజాయి సేవిస్తుండగా పట్టుకున్నామని, వారు ఒక సాధువు దగ్గర కొన్నామని తెలిపారన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపడతామని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో సురక్షిత అంతర్జాల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టులు, వ్యక్తిత్వ హననం వంటి నేరాల వల్ల కలిగే శారీరక, మానసిక ఇబ్బందులను నివారించడానికి ప్రశాంతత అవసరమని పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని, అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయకూడదని, బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని సూచించారు. జిల్లా ఎన్ఐసీ అధికారి కె.కిరణ్ కుమార్ సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు జిల్లా సమాచార ఎన్ఐసీ అధికారి విజయ్‌బాబు, నెట్‌వర్క్ ఇంజినీర్ శ్రీరామ్ ప్రకాష్, ఈ-ఆఫీస్ టెక్నికల్ అసోసియేట్ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

13న తండేల్ చిత్ర యూనిట్ రాక

శ్రీకాకుళం అర్బన్: తండేల్ సినిమా విజయవంతం కావడంతో ఈనెల 13న ఆ చిత్ర యూనిట్ శ్రీకాకుళం రానుంది. శ్రీకాకుళంలోని ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో విజయోత్సవ సంబరాలు జరగనున్నాయి. ఈ వేడుకలకు తండేల్ హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి, డైరెక్టర్ బన్నీ వాసు చిత్ర కథా రచయిత తీడ కార్తీక్‌లతో పాటు సినిమా యూనిట్ రానుంది

కూర్మనాథుని సన్నిధిలో కనుమూరి



గార: శ్రీకూర్మనాథాలయంలో బాపిరాజు దంపతులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మం శ్రీకూర్మనాథున్ని మాజీమంత్రి, తిరుమల తిరుపతి దేవస్థానముల మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు సతీసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు క్షేత్ర మహత్యాన్ని తెలియజేశారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, అంధవరపు సూరిబాబు తదితరులు ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో...

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని కనుమూరి బాపిరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ పూజలు జరిపించి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరితో పాటు ఈపీడీసీఎల్ మాజీ డైరెక్టర్ సూర్యప్రతాప్ దర్శించుకున్నారు. వారితో దుప్పల రవీంద్ర, ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు, ఎంఎస్‌పీ ఈఈ బయ్యన్నాయుడు, డీ-1 ఏఈ సురేష్‌కుమార్, జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షుడు ఉంగటి పాపారావు ఉన్నారు.

తగ్గేదే లే..!

- ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల మధ్య ఆధిపత్య పోరు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోషల్ వర్క్ విభాగానికి సంబంధించిన ఇద్దరు రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. దీంతో ఉన్నతాధికారుల సమక్షంలో మంగళవారం పంచాయితీ జరిగింది. అయితే అధికారుల సమక్షంలో సైతం వీరిమధ్య ఆధిపత్య పోరు కొనసాగింది. డిపార్టమెంట్ మూసేస్తామంటూ అధికారులు తీవ్రంగా హెచ్చరించినా.. మూసుకోండి అంటూ ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ సమాధానం ఇవ్వడం గమనార్హం. గత నెల 31వ తేదీన ఇద్దరు రీసెర్చ్ స్కాలర్లకు ప్రీ టాక్ నిర్వహించారు. ఇదే సమయంలో తన రీసెర్చ్ స్కాలర్‌కు వైవా నిర్వహించాలని ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ కోరారు. అయితే మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ (విభాగాధిపతి) తనకు ఫైల్ సిద్ధం చేసేందుకు సమయం కావాలని, ఫిబ్రవరి 19న వైవా నిర్వహణకు ఫైల్ సిద్ధం చేస్తానని చెప్పారు. దీంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ తీసుకెళ్లారు. అప్పటినుంచి వీరిని అధికారులు అనేకసార్లు పంచాయితీకి పిలిచినా కుదరలేదు. చివరికి మంగళవారం వీరి మధ్య మీటింగ్ నిర్వహించగా.. అధికారుల ముందే వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం సోషల్‌వర్క్ విభాగంలో మొదటి ఏడాదిలో 40 సీట్లుకు 17 మంది, రెండో ఏడాదిలో 40 సీట్లుకు ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది పీజీ సెట్ ర్యాంకుతో సంబంధం లేకుండా స్పాట్ అడ్మిషన్లు నిర్వహణ వలన ఈ ప్రవేశాలు జరిగాయి. కాగా ప్రొఫెసర్ల విభేదాలు వర్సిటీలో చర్చనీయాంశంగా మారాయి.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



రెండు ముక్కలైన యువకుడి శరీరం



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ ఎల్‌సీగేటు సమీపంలో మంగళవారం ఉదయం రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఉదయం కాశీబుగ్గ ఎల్‌సీగేట్ వేసిన సమయంలో ఒక యువకుడు బ్యాగుతో గేటు దాటుకొని లోపలికి వెళ్లాడు. ఆ సమయంలో పలాస నుంచి వస్తున్న గూడ్స్ రైలును చూసి అటువైపుగా నడుస్తూ వెళ్లడం గమనించి, గేటు బయట ఆగి ఉన్న ప్రయాణికులు కేకలు వేశారు. అయినప్పటికీ యువకుడు వినకుండా ఏడుస్తూ వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమాదంలో యువకుడి శరీరం రెండు ముక్కలైంది. దీంతో గేట్‌మెన్, స్థానికులు జీఆర్పీ, ఆర్‌పీఎఫ్‌కు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటుంది. చేతిపై నాగుపాము పగడవిప్పుకుని ఉండే పచ్చబొట్టు ఉంది. తన వెనుకనున్న బ్యాగులో పాత దుస్తులు తప్పితే ఎటువంటి ఆధారాలు దొరకలేదు. దీంతో ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మలయాద్రి పర్యవేక్షణలో జీఆర్పీ ఏఎస్ఐ చక్రధరరావు తన సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసినవారు 96180 17943 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయురాలు ఆత్మహత్య



సుస్మిత పాత్ర(ఫైల్)

కంచిలి: మండలంలోని కుంబరినౌగాం ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కుమారి సుస్మిత పాత్ర(44) సోమవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. డీజీపురం గ్రామంలో వారు నివాసముంటున్న ఇంట్లోనే మృతురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈమె భర్త దేవేంద్ర బ్రహ్మ ఒడిశాలోని పురియా సాహిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భర్త ఒడిశా పాఠశాల నుంచి సాయంత్రం 4.30 గంటలకు ఇంటికి వచ్చేసరికి తలుపులు మూసి ఉన్నాయి. ఎంతసేపు కొట్టినా తలుపు తీయకపోవడంతో స్థానికుల సాయంతో విరగ్గొట్టి లోపలికి ప్రవేశించాడు. అయితే అప్పటికే సుస్మిత పాత్ర ఉరికి వేలాడుతోంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సుమన్ బ్రహ్మ విశాఖపట్నంలో ఇంటర్ చదువుతుండగా, చిన్న కుమారుడు సూరజ్ బ్రహ్మ డీజీపురం ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే సుస్మిత ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. భర్త ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదేళ్ల చిన్నారిపై లైంగికదాడి

సారవకోట: మండలంలోని కోదడ్డపనస గ్రామంలో పదేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన పిర్ల రామారావు అలియాస్ ముకుందరావు లైంగికదాడికి సోమవారం పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో గ్రామంలోని చింతచెట్టు సమీపంలో చిన్నారులు ఆడుకుంటుండగా, చుప్పులు ఇస్తానని చెప్పి నిందితుడు రామారావు(47) ఇద్దరిని పిలిచాడు. అందులో ఒక అమ్మాయికి చుప్పులిచ్చి పంపించి వేరే అమ్మాయిని ఇంట్లోకి తీసుకెళ్లాడు. దీన్ని గమనించిన మరో చిన్నారి బాధిత చిన్నారితో పాటే వెళ్లడంతో, ఆ చిన్నారిని వీపు మీద కొట్టి పంపించేశాడు. అనంతరం ఒక చిన్నారిని ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి ప్రయత్నించాడు. ఆ చిన్నారి ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లింది. తల్లి ప్రశ్నించడంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో తల్లి సారవకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ అనిల్ కుమార్ పోక్సో కేసు నమోదు చేశారు. విషయాన్ని నీరు గార్చేందుకు స్థానిక నాయకులు ప్రయత్నించడం గమనార్హం. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం డీఎస్పీ డి.ప్రసాదరావు సంఘటన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. బాధిత చిన్నారిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

కెనరా బ్యాంక్ Canara Bank
శ్రీకాకుళం-II బ్రాంచ్ (13560), రామకృష్ణ థియేటర్ దగ్గర, శ్రీకాకుళం-532001. ఫోన్: 9440905457

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ శ్రీకాకుళం-II బ్రాంచ్ వారికి ఋణగ్రహీత(లు): శ్రీ ప్రధాన చక్రవర్తి, తండ్రి: రామారావు, హామీదారులు: 1) శ్రీమతి ప్రధాన హేమలత, భర్త: ప్రధాన చక్రవర్తి, 2) శ్రీమతి గొంటి అలివేలు మంగమ్మ, భర్త: వైకుంఠరావు వారు చెల్లించవలసిన బకాయి రూ. 17,51,390.09 (అక్షరాల పదిహేడు లక్షల యాభై ఒక్క వేల మూడు వందల తొంభై రూపాయలు మరియు తొమ్మిది పైసలు మాత్రమే) + వడ్డీ మరియు ఖర్చులను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ శ్రీకాకుళం-II బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/సూచనాత్మక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 28.02.2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 28.02.2025, మ॥ 3.00 గం.ల నుండి మ॥ 4.00 గం.ల వరకు

రిజర్వు ధరలో 10% ధరావత్తును ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, శ్రీకాకుళం-II బ్రాంచ్ వారి ఖాతా నెం. 209272434, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్: CNRB0013560 కు తేది: 28.02.2025, మ॥ 12:00 గం.ల లోపుగా చెల్లించవలెను.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

శ్రీకాకుళం జిల్లా, దాపురం పంచాయితీ, ఎంగ రూరల్ గ్రామం, పాత ఎస్. నెం. 83/2, కొత్త ఎస్.నెం. 294/7P మరియు 294/8P, మొత్తం 1034.78 చ॥గు॥లో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు 35 చ॥గు॥ వాటా స్థలముతో గణేష్ రెసిడెన్సీ-2, మూడవ అంతస్తులో 1150 చ॥అ॥లు కలిగిన ఫ్లాట్ నెం. T-5. స్థలము హద్దులు: తూర్పు: 30 అ॥ వెడల్పు రోడ్డు, దక్షిణం: సింహాద్రి సతీష్‌కుమార్ బిల్డర్స్ ఇల్లు, పడమర: గణేష్ రెసిడెన్సీ-1 అపార్ట్‌మెంట్స్, ఉత్తరం: బరాటం గోవింద రాజులు మరియు ఇతరుల బిల్డర్స్ ఇల్లు. ఫ్లాట్‌కు హద్దులు: గోవింద నగర్ కాలనీ, గణేష్ రెసిడెన్సీ-2, మూడవ అంతస్తులో సూపర్ బిల్టప్ ఏరియా 1150 చ॥అ॥ (ఉమ్మడి ఏరియాలతో కలుపుకొని) నిర్మాణమైన ఫ్లాట్ నెం.T-5. హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, దక్షిణం: ఓపెన్ సెట్ బ్యాక్, పడమర: ఓపెన్ సెట్ బ్యాక్, ఉత్తరం: ఓపెన్ సెట్ బ్యాక్. టైటిల్ హోల్డర్: శ్రీ ప్రధాన చక్రవర్తి.

రిజర్వు ధర: రూ. 25,75,000/- ధరావత్తు సొమ్ము: రూ. 2,57,500/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, శ్రీకాకుళం-II బ్రాంచ్, చీఫ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 9440905457

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (Baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.

తేది: 10.02.2025, ప్రదేశం: శ్రీకాకుళం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, BORADA GOWRI (Old Name) W/o Lukalapu Harikrishna, 1-00, Miriyapalli, Mariyapalle Post, Srikakulam Dist. I changed my name as LUKALAPU GOWRI LAKSHMI (New Name) Hearafter my name is known as LUKALAPU GOWRI LAKSHMI (New Name)

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

WANTED

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8919613984 [HA-99808]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. Ph: 9160900024, 9640400073 [HA-1400]

■ కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ఆంధ్ర హోమ్‌కేర్ ఆఫీస్‌కి కావలెను. మంచి జీతం +వ+భో. ✆ 91608 35559, 78158 35561 [B-466]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.